ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023

5

కర్నూలు



'ఉపాధి'కి తూట్లు

- కూలీలకు సౌకర్యాలు అంతంత మాత్రమే
- నీడలేక ఎండల్లో మగ్గుతూ అస్వస్థత
- ఉపాధి చట్టం పరిరక్షణకు నేడు ధర్నా
- బివి రాఘవులు రాక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పేద ప్రజలకు ఆసరాగా నిలిచే ఉపాధి హామీ చట్టానికి తూట్లు పడుతున్నాయి. పథకం అమలు అస్తవ్యస్తంగా మారుతుంది. కర్నూలు మండలం పరిధిలో జరుగుతున్న వివిధ ఉపాధి హామీ చట్టం పనుల్లో పలు లోపాలు వెలుగు చూశాయి. పంచలింగాల గ్రామంలో పలుచోట్ల ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో మొత్తం పథకం కింద 519 కుటుంబాలకు గాను సుమారు 1000 మందికి పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో రోజువారీగా 150 నుంచి 180 మందికి ఉపాధి పనులు లభిస్తున్నాయి. ఉపాధి పనుల్లో చట్టం నిబంధనల ప్రకారం.... ఉపాధి కార్మికులకు ప్రత్యేక సౌకర్యాల కింద ఏర్పాటు చేయాల్సిన టెంట్లు, తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు ఏమాత్రం చేయడం లేదు. కూలీలకు రవాణా చార్జీలు చెల్లించడం లేదు. ఇవే కాకుండా తట్టా, బుట్ట, గడ్డపార వంటి పరికాల నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వడం లేదు. కనీసం అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స నిర్వహించడానికి అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో ఉండడం లేదు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు (ఫైల్)

గిట్టుబాటు కానీ కూలి : ప్రభుత్వ నిర్ణయం మేరకు రోజుకు ఒక వ్యక్తికి రూ. 272 కూలిగా చెల్లించాల్సి ఉంది. కాగా చాలా సందర్భాల్లో రూ.170 మంచి రూ.200లకు మించడం లేదు. గతంలో కరువు అలవెన్స్ కింద 30శాతం అదనంగా చెల్లించే కూలిని ప్రభుత్వం ప్రస్తుతం చెల్లించడం లేదు. కూలి సంగతి అటు ఉంచితే ప్రస్తుతం పెరిగిన ఎండ తీవ్రత ఉపాధి కూలీలను తీవ్రఅస్వస్థతకు గురిచేస్తోంది. అత్యధికంగా 42 డిగ్రీలు ఉష్ణోగ్రతల సైతం నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామంలో చేపట్టిన ఉపాధి పనుల్లో ముగ్గురు కూలీలు ఎండ తీవ్రతకు తాళలేక సువార్తమ్మ, లక్ష్మి అనే మహిళలతోపాటు మరొక వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం రెండు పూటల ఉపాధి పనులు నిర్వహిస్తుండడం పట్ల ఉపాధి కూలీలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యలను పరిష్కరించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని , ఉపాధి కార్మికులు ఈనెల 22న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధమయ్యారు. అంతకంటే ముందు ప్రభుత్వ అధికారులు ఉపాధి హామీ చట్టంలో ఉన్న లోపాలను సవరించాలని, చట్టం సమగ్రంగా అమలు చేయాలని కోరుతున్నారు.

కూలి గిట్టుబాటు కావడం లేదు



కుటుంబంలో ముగ్గురు ఉపాధి పనుల జాబ్ కార్డులో నమోదవగా ఇద్దరికే పని దొరుకుతుంది. ఒకరు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. రోజు కూలి కూడా రూ.170 నుంచి రూ.230 మాత్రమే పడుతుంది. గిట్టుబాటు కావడం లేదు. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రెండు పూటల పనులు అంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

- ముప్పసాని బాబు, ఉపాధి కూలీ

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు నేడు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసంఈనెల 22న సోమవారం కర్నూలు ధర్నా చౌక్‌లో ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు. పథకానికి బడ్జెట్ పెంచాలని, పని దినాలు పెంచాలని, రెండు పూటల పని విధానం రద్దు చేయాలని, ఉపాధి హామీ పరిరక్షణకు, కూలీల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఎం పోలీట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చరిత్రను తెలుసుకోవడం ద్వారానే సమాజాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న బడే సాహెబ్

- జెవివి జిల్లా కార్యదర్శి బడేసాహెబ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

విద్యార్థులు చరిత్రను తెలుసుకోవడం ద్వారానే సమాజాభివృద్ధికి తోడ్పడగలుగుతారని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బడే సాహెబ్ తెలిపారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం రెండోరోజు 'భారత స్వాతంత్రోద్యమ చరిత్ర - విద్యార్థుల పాత్ర' అనే అంశంపై బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, జెవివి జిల్లా కార్యదర్శి కె.బడేసాహెబ్ బోధించారు. అనంతరం 'గతితార్కిక భౌతిక వాదం' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి, ప్రస్తుత ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వందల ఏళ్ల సుసంపన్నమైన చరిత్ర గలిగిన భారతదేశంలో విద్యార్థుల పాత్ర కూడా కీలకమైందని తెలిపారు. చెరిపేస్తే చెరిగిపోయేది కాదు చరిత్ర అని, గత కాలపు అనుభవాలను పంచుతూ నవ నిర్మాణం వైపు అడుగులు వేయిస్తుందని చెప్పారు. ఛాందసవాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రతిదీ ప్రశ్నతో మొదలుపెట్టి సమాజానికి ఒక సమాధానంగా మారాలన్నారు. 'చదువు - పోరాడు' అనే నినాదాన్ని భుజస్కంధాలపై వేసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వం, సిలబస్ వరకే పరిమితం కాకుండా, సమాజంలో జరుగుతున్న రుగ్మతలపై కూడా సంపూర్ణ పరిజ్ఞానాన్ని సాధించాలని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి దేశ దిశా దశ నిర్దేశకులని, బాగా చదువుతూనే చదువుకు ఏర్పడే ఆటంకాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అందుకు చరిత్ర అధ్యయనం అనేది ప్రధానమైందని తెలిపారు. రెండో రోజు క్లాసులకు ప్రిన్సిపల్‌గా శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్‌గా రవి క్లాసులు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, మండల కార్యదర్శి వీరన్న, నాయకులు ఖాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ

మార్షల్ ఆర్ట్స్‌కు ఆదరణ పెరగాలి

- సినీహీరో సుమన్

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్



సుమన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శోభన్ బాబు

రాష్ట్రంలో మార్షల్స్ ఆర్ట్సకు ఆదరణ తప్పక పెరగాలని ప్రముఖ సినీహీరో సుమన్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం మౌర్యా ఇన్ హోటలో బసచేసిన ఆయనను కర్నూలు జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, జిల్లా ఒలింపిక్ ఉపాధ్యక్షుడు జి.శోభన్‌బాబు హోటల్‌లో హీరో సుమన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. మార్షల్ ఆర్ట్స్‌లో 4థ్ డాన్ బ్లాక్ బెల్ట్ ఆయన సుమన్ మాట్లాడుతూ ప్రస్తుతం నాణ్యతలేని క్రీడలు ఉన్నాయన్నారు. ప్రయోజనకరంగా చలిచి సమాజానికి ఉపయోగపడాలన్నారు. డబ్బే ప్రాధాన్యత గా మార్షల్ ఆర్ట్స్ నడుస్తున్నాయని అన్నారు. మార్షల్ ఆర్ట్స్ ఆయన కరాటే , తైక్వాండో లాంటి క్రీడల్లో వీధి వీధికి ఒకిటి వెలసి నిజమైన క్రీడా నేర్పేది ఏవ్వరో తెలియని పరిస్థితి ఉందన్నారు. తప్పక క్రీడకు ప్రాధాన్యత ఇచ్చే సరైన శిక్షకులు లేరని సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శోభన్‌బాబు మాట్లాడుతూ సుమన్, శోభన్ బాబు కలసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధ్యక్షు కార్యదర్శిగా పనిచేశామని, ఆ సమయంలో టైక్వాండోకు ఎంతో ఆదరణ లభించిందని, సుమన్ ప్రోత్సాహంతో రాష్ట్రంలో అనేక తైక్వాండో శాఖలను ప్రోత్సహించటం ప్రారంభమైందని తెలిపారు. సుమన్‌ను జిల్లా తైక్వాండో సంఘం తరపున అభినందించారు.

జల జీవన్ మిషన్ కింద రూ.531.69 కోట్లు

- జగనన్న కాలనీలకు రూ.49.10 కోట్లు
- జిల్లాలో తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు
- ఓర్వకల్‌లో రెండు గ్రామాలకు నీటి సరఫరా
- ఇంటింటికి కుళాయి పనులు వేగవంతం
- ప్రజాశక్తితో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరావు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో తాగునీటి సమస్యలను తక్షణం పరిస్కారం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అత్యధికంగా జల జీవన్ మిషన్ కింద పనులు నిర్వహిస్తున్నాం. ఎక్కడ కూడా తాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణలో వారి సలహాలు సూచనలు మేరకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. తాగు నీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, కేటాయిస్తున్న నిధుల వివరాలతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరావుతో ప్రజాశక్తి ముఖాముఖి.

జల జీవన్ మిషన్ కింద ఎన్ని చోట్ల పనులు నిర్వహిస్తున్నారు. ఎంత నిధులతో ?

ఎస్ఇ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ. 531.69 కోట్ల పనులు జరుగుతున్నాయి. విడతల ప్రకారం పనులు మంజూరు అయ్యాయి. మంజూరు అయిన మేరకు టెండర్లు నిర్వహించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం.



ఎన్ని విడతల్లో పనులు నిర్వహిస్తున్నారు.ఎన్ని పనులు పూర్తి అయ్యాయి.?

ఎస్ఇ: మొదటి విడతలో 393 పనులకు గాను 133.55 కోట్లు మంజూరు అయ్యాయి. ఇందులో 307 పనులకు అగ్రిమెంట్ అయ్యాయి. 141 పనులు పూర్తి అయ్యాయి. 89 పనులు పురోగతిలో ఉన్నాయి. 78 పనులు టెండర్లు జరిగాయి. 81 పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఫేస్ 3 కింద రూ.398.11 కోట్లు మంజూరయ్యాయి. 633 పనులు వచ్చాయి. ఇవన్ని టెండర్ దశలో ఉన్నాయి.

హార్ ఘర్ కింద ఎన్ని పనులు ,ఎన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నారు?

ఎస్ఇ : హర్‌ఘర్ కింద (ఇంటింటికి మంచినీటి కుళాయిలు) అయిదు మండలాల్లో 13 గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఆస్పరి, దేవనకొండ, కల్లూరు, క్రిష్ణగిరి ,సి.బెళగల్ మండలాల్లో జరుగుతున్నాయి. దాదాపు అన్ని పనులు పూర్తి కావస్తున్నాయి.

జగనన్న కాలనీల్లో నీటి సరఫరా పనులు ఎంత నిధులతో చేస్తున్నారు?

ఎస్ఇ: జగనన్న కాలనీల్లో జిల్లాలో 227 లేవుట్‌లలో రూ.49.10 కోట్ల నిధులతో పనులు నిర్వహిస్తున్నాం. కల్లూరు దొడ్డిపాడు గ్రామం పూర్తయింది. జగనన్న కాలనీల్లో అన్ని లేవుట్‌లలో కట్టడాలకు అనుకూలంగా తాత్కాలిక నీటి సరఫరా ఏర్పాటు చేశాం.పూర్తి అయిన లేవుట్లకు శాశ్వత మంచి నీటి కుళాయిలు పనులు పూర్తి చేస్తున్నాం.

జిల్లాలో తాగు నీటి సమస్యలున్న గ్రామాలకు ఎలాంటి సదుపాయాలు కల్పించారు. అలాంటి గ్రామాలు ఉన్నాయా ?

ఎస్ఇ: జిల్లాలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాం. జిల్లాలో ఓర్వకల్ మండలం లోని రెండు గ్రామాల్లో తిప్పాయిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు ట్రాన్స్ పోర్ట్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. అక్కడ నీటి సమస్యకు అంతరాయం లేకుండా చేశాం.

మనబడి నాడు నేడు పనులు ఎక్కడ నిర్వహిస్తున్నారు?

ఎస్ఇ: మనబడి నాడునేడు పనులు జిల్లాలో ఓర్వకల్, ఆస్పరి, దేవనకండ, హాలహర్వి, చిప్పగిరి గోనెగండ్ల మండలాల్లో జరుగుతున్నాయి. అక్కడ నీటి సమస్యలు పరిష్కారానికి ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పనులు జాప్యం లేకుండా చూస్తున్నాం.

గడప గడప కు మన ప్రభుత్వం లో సమస్యలు ఏమైనా వచ్చాయా .అలాంటివి ఎన్ని చేశారు.

ఎస్ఇ: గడప గడపకు మన ప్రభుత్వంలో 178 పనులకు మంజూరు జరిగింది.114 పనులు పూర్తి చేశాం. మిగతావి పూర్తి కావస్తున్నాయి. చాలా గ్రామాల్లో వెంటనే పనులు పరిస్కారం చేశాం.

జిల్లాలో ఇంకా ఎలాంటి పనులు నిర్వహిస్తున్నారు?

ఎస్ఇ: జెడ్పిటిసిలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరయింది. ఆ నిధులతో 373 గ్రామాల్లో నీటి ట్యాంకులు తాగు నీటి శుద్ధి ,పైప్ లైన్ పనులు తక్షణం చేయాల్సిన అన్ని పనులను నిర్వహిస్తున్నాం. ఇంటింటికి కుళాయి సమస్యలు వేగంగా పూర్తి చేయడానికి మరింత గట్టి చర్యలు తీసుకుంటున్నాం.





రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న లక్ష్మీనరసింహా యాదవ్ తదితరులు

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కంప్యూటర్ రంగాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు జి.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు నంద్యాల చెక్ పోస్ట్ దామోదర్ సంజీవయ్య భవనంలో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లక్ష్మి నరసింహ యాదవ్ పూలమాలేసి నివాళులర్పించారు. లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆగస్టు 20 1944 జన్మించారన్నారు. 1984-1989 మధ్య కాలం లో ప్రధానిగా చేశారు. అతి పిన్న వయస్సులో ప్రధానిగా చేసిన ఘనత రాజీవగాంధీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

కర్నూలు కలెక్టరేట్ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి కర్నూలు కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు. ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. డిసిసి ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ గుప్త, కోడుమూరు నియోజవర్గం ఇన్చార్జి దామోదరం రాధాక్రిష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి హెచ్ బజారన్న. కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్, మైనార్టీ సెల్ సిటి అధ్యక్షులు ఖజా హుస్సేన్ మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు కె. ప్రమీల, ఎస్‌సి సెల్ చైర్మన్ డబ్ల్యూ సత్యరాజు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా విరిగిపడిన మర్రి చెట్టు

రోజంతా నిలిచిన రాక పోకలు- ఇబ్బందుల్లో దొడ్డిపాడు గ్రామ ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పై మర్రి చెట్టు శనివారం రాత్రి విరిగిపడింది. అప్పటి నుంచి గ్రామానికీ రాక పోకలు నిలిచిపోయాయి. 24 గంటలు గడిచినా చెట్టును తొలగించకపోవడంతో గ్రామస్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగి పడిన చెట్టును తొలగించి రహదారిపై రాక పోకలు పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి..ప్రభుత్వ పథకాలను వివరిస్తూ...ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. ఆప్యాయంగా ప్రజలును పలుకరిరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు, వార్డ్ కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్, వార్డ్ ఇంచార్జి ఖాదర్ బాషాకు పూలమాలలతో బొకేలతో ఘనంగా స్వాగతం పలికారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జగనన్నని ఆశీర్వదించాలని కోరారు. జగనన్న పరిపాలనలోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వీధిలో ఉన్న డ్రైనేజీ, మురికి కాలువల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలను తీర్చేందుకు మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. వైసిపి ముఖ్య నాయకులు, కన్వీనర్లు ఖుద్దుస్, చాంద్‌బాష, నజీర్ అహ్మద్, ముజహీద్, శేఖర్, భీమన్న, గౌసియ, జయబాయ్, హకీమ్ భాయ్, అంజు భాయ్, అక్బర్, మక్బుల్, రాజు, ఫారజాన, కరీముల్లా, మున్న, సాహెబ్, ఎలక్ట్రికల్ ఎఇలు మదన్ మోహన్, లైటింగ్ సూపరింటెండెంట్ జగదీష్, ఆర్‌పిలు, సచివాలయం సిబ్బంది, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాడిన కొల్లినాగేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడిన మహా నాయకుడు కొల్లి నాగేశ్వరావు అని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం అన్నారు. ఎఐకెఎస్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు సిపిఐ సీనియర్ నాయకుడు కొల్లి నాగేశ్వరావు మూడవ వర్ధంతిని కర్నూలు సిఆర్ భవన్‌లో నిర్వహించారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షత వహించారు. కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం పూలమాల వేసి నివాళులు అర్పించారు. జగన్నాథం మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు విద్యార్థి నాయకునిగా, సిపిఐ కృష్ణాజిల్లా కార్యదర్శిగా పనిచేశారని, రైతుల సమస్యల పక్షాన అవిశ్రాంతంగా పనిచేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర నాయకులు సోమన్న, రామచంద్ర, నీలకంఠ, మునిస్వామి పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ డిల్లిపబ్లిక్ స్కూలు ప్రారంభం

త్రిదండి చినజీయర్ స్వామి, టిజివి, కాటసాని హాజరు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలులోని చిన్న టేకూరులో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను త్రిదండి చిన జీయర్ స్వామి ఆదివారం ప్రారంభించారు. అంతర్జాతీయ ఢిల్లీపబ్లిక్ స్కూల్ రాయలసీమలోని ఏకైక అంతర్జాతీయ బోర్డింగ్ స్కూల్ , 9.75 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ స్కూల్ భారతదేశంలో బాగా స్థిరపడిన, ప్రముఖ , వేగంగా అభివృద్ధి చెందుతున్న సిబిఎస్ఇ విద్యా సమూహంలో భాగం. 25 రాష్ట్రాలలో 280కి పైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సమూహంలో నాలుగు లక్షల కొత్త తరం విద్యార్థులు సుసంపన్నమైన జాతీయ విద్యా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అంతర్జాతీమ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద రెసిడెన్షియల్ స్కూళ్లలో ఒకటి, కర్నూలు టౌన్ రాగ మయూరి బిల్డర్స్ గొడుగు కింద ఉంది. కెజెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నుండి ఒక పాఠశాల విశాలమైన క్యాంపస్ గ్రీన్ జోన్లలో బాగా డిజైన్ చేసిన విద్యా ప్రాంతం. క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, స్కేటింగ్ మరెన్నో క్రీడల కోసం విస్తారమైన ఆట స్థలాలతో అల్ట్రా-ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కెజెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కెజె రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో తమ పిల్లలకు విద్యనందించాలని ఆకాంక్షిస్తున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కర్నూలు ఐడిపిఎస్ కట్టుబడి ఉందన్నారు. కర్నూల్లో తొలిసారిగా ఇక్కడ ఒక పాఠశాల ఉందని, ఇది శ్రద్ధ వహించే వాతావరణాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థులలో బాల్యాన్ని కాపాడుతుందని, మౌలిక సదుపాయాలు , అంతర్జాతీయ ప్రమాణాల బోధనా సహాయాలను అందిస్తుందన్నారు.



ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి, కాటసాని

అప్పులు బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-తుగ్గలి



కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన గోవర్ధనగిరి వాసు దేవరెడ్డి (48)అప్పులు బాధలు తాళలేక ఆదివారం మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.... తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన గోవర్ధనగిరి వాసుదేవ రెడ్డి గత కొన్ని నెలల క్రితం బతుకుతెరువు కోసం కర్ణాటకలోని కోలార్‌లో జీవనం సాగిస్తున్నాడు. ఆయనకున్న పొలంతో పాటు ఆర్థిక ఇబ్బందులుతో కొట్టుమిట్టాడుతుండగా దానికి తగ్గట్టుగా ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారి పోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చుకోవాలని మన స్థాపన గురైన రైతు కోలార్ లోని ఒక లాడ్జిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన భర్త అప్పులు బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య యశోదమ్మ తెలిపారు.

నేడే కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణ ముగింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినోదం, విజ్ఞానం, వికాసం కోసం ఏర్పడిన కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణ ముగింపు ఉత్సవాలు ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు సి.క్యాంప్‌లోని లలితకళా సమితిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ వేసవి శిక్షణ ముగింపు ఉత్సవాలకు ముఖ్య వక్తగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి హాజరవుతున్నారని తెలిపారు. ఈ ముగింపు ఉత్సవాలకు అందరూ హాజరయి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేటి కలెక్టరేట్ ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి- తుగ్గలి : జాతీయ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు అన్ని వసతులను కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న చలో కలెక్టరేట్ ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగరాజు, సిఐటియు మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, ప్రతాప్ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు సౌకర్యాలను కల్పించడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. కూలీలకు పనులు చేసిన చోట సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదన్నారు.

తుగ్గలిలో పలు ఇళ్లలో చోరి

ప్రజాశక్తి తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి బిసి కాలానిలో శనివారం రాత్రి కొంతమంది ఇళ్లలోకి దొంగలు చొరబడి బంగారు, నగదును దోచుకున్నారు. కాశమ్మ ఇంట్లో రెండు తులాలు బంగారు, రు.50 వేలు నగదును దొంగలు దోచుకెళ్లినటుల ఆమె పోలీసులకు పిర్యాదు చేశారు. కాశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోను దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. అదేవిధంగా బిసి కాలనీలో మరి కొన్ని ఇళ్లలో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

టిడిపిలోకి గురురాజా రావు దేశాయి..?

- జూన్ 3 లేదా 4న చేరిక...



ప్రజాశక్తి - నందవరం

మరోసారి తాలూకా స్థాయిలో నందవరం మండల టిడిపిలో చర్చ మొదలైంది. 2019 ఎన్నికల తర్వాత దాదాపు నాలుగేళ్లుగా రాజకీయ పార్టీలకు దూరంగా ఉంటూ తటస్థంగా ఉన్న దేశాయి నెట్వర్క్ అధినేత గురురాజా రావు దేశాయి జూన్ 3 లేదా 4న ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరనున్నట్లు సమాచారం. గతంలో నుంచి ఆయన చిన్నాన్న, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి బీవీకి దూరంగా ఉంటున్నారు. ఆయన దూరం కావడంతో మండలంలో కొంతమంది టిడిపి నాయకులు, గురురాజా దేశాయి సన్నిహితులు మాధవ రావు స్థానాన్ని భర్తీ చేసేందుకు గురురాజా దేశాయిని పార్టీలోకి రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. పార్టీ నాయకుల కొన్ని నెలల నిరీక్షణకు నేడు తెరపడింది. ఆయన పార్టీలోకి రావడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. మాధవ రావు దేశాయి అన్న కుమారుడే గురురాజా రావు దేశాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరిలో ఒకరు పార్టీకి దూరం కావడం, మరొకరు దగ్గర కావడంతో నందవరం మండలం రాజకీయం రసవత్తరంగా మారింది. మరి ఎవరి బలాలు ఏమిటనేది 2024 ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే...

ఎస్సీ హాస్టళ్ల దశ మారేనా..?

- సౌకర్యాల లేమితో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆదోని

కార్పొరేట్‌కు ధీటుగా విద్యనందిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులకు షరా మామూలు అయింది. కార్పొరేట్ కాదు కదా కనీసం దోమలు, ఈగల బారిన పడకుండా కూడా నివారణ చర్యలు చేపట్టలేని పరిస్థితుల్లో అధికారులు ఉంటున్నారు. ఇలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో చదువు ఎలా కొనసాగించేది విద్యార్థులు ఆవేదన చెందుతున్న పరిస్థితి ఉంది.

ఆదోని సబ్ డివిజన్‌లో బాలబాలికలకు మెరుగైన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఆదోనిలో బాలికలు, ఆలూరు, నందవరం ప్రాంతాల్లో బాలురకు ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టల్‌లో 4 నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వసతి పొందుతూ చదువుకునే సౌలభ్యం ఉంది. ఒక్కో హాస్టల్‌లో 400 మంది విద్యార్థులు వసతి పొందేందుకు భవనాల నిర్మాణం జరిగింది. మొదట్లో భవనాలు సుందరంగా ఉండేవి. ప్రస్తుతం పాడుపడిన వాటిలా కనపడుతున్నాయి.

కరువైన ఆలనా పాలన

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణాలు జరిగి దశాబ్ద కాలం గడిచిపోయింది. అప్పటి నుంచి భవనాల గోడలకు సున్నం, రంగులు వేయడం మరిచారు. కిటికీల అద్దాలు పగిలిపోవడంతో ఈగలు, దోమలు ఆహార పదార్థాలపై వాలి విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో వర్షపు జల్లులు గదుల్లోకి చీస్తుండడంతో పుస్తకాలు, బట్టలు తడిసిపోతున్నాయి. కిటికీలకు అద్దాలు లేకపోవడంతో చలికాలంలో చలి తీవ్రత తట్టుకోలేక అట్టలు ఉంచిన చలికి గజగజ వణుకుతున్న పరిస్థితి ఉంది.

తాగునీటి తప్పని ఇబ్బందులు

ఆదోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీగా మున్సిపల్ ట్యాంకర్ నీటిపైనే ఆధార పడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా నేరుగా కుళాయి ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. పేద పిల్లలు ఉండే వసతి భవనాల పట్ల అధికారులకు ఎందుకు కనికరం చూపడం లేదని పలువురు నిలదీస్తున్నారు. నాడు-నేడు కింద స్కూల్ భవన నిర్మాణ రూపురేఖలు మారుస్తున్న ప్రభుత్వం హాస్టల్‌లో మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని, ఇలా అయితే విద్యార్థులు ఉండలేక హాస్టళ్ల మూతపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ మాసంలోనైనా భవన నిర్మాణ మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆదోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో కిటికీలకు పగిలిన అద్దాలు

ప్రతిపాదనలు పంపాం

- సుధాకర్, ఎఎస్‌డబ్ల్యుఒ, ఆదోని

ఆదోని సబ్ డివిజన్‌లోని ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్‌లో మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, నందవరం హాస్టళ్లలో పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాం. విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇంకా సమయం ఉంది. నిధులు రాగానే యుద్ధప్రాతిపదికన కిటికీలకు అద్దాలు, గోడలకు రంగులు, ఇతర మరమ్మతు పనులు చేయిస్తాం. అధైర్య పడాల్సిన అవసరం లేదు.

నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తాం

- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి, ఆదోని

హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. విద్యాసంవత్సరం ప్రారంభంలోపు తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలి లేకపోతే విద్యార్థులను సమకూర్చి ఆందోళనలు నిర్వహిస్తాం. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకుండా కాలయాపన చేశారు. ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం.

ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ



ప్రజాశక్తి - చిప్పగిరి

ఎండాకాలం మొదలయ్యే వర్షాలకు భయంకరమైన ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రతి ఒక్కరూ సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో ఉరుములు, మెరుపుల ద్వారా గొర్రెలు చనిపోయిన సంఘటనలు చూశామని తెలిపారు. ముఖ్యంగా గొర్రెల కాపరులు వాతావరణ సూచన తెలుసుకొని ఉరుములు, మెరుపులకు గురికాకుండా సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో స్తంభాల దగ్గర గాని, చెట్ల కిందికి వెళ్లకూడదని తెలిపారు. గృహాల్లో ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు కరెంట్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసుకోవాలన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ఈ మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లో
ఐ.పి. నెంబర్. 22/ 2023

పి.మహమ్మద్ ఖాశీం. ...అర్జీదారు

- ఎదురు -

విష్ణు వగైరా.
...రెస్పాండెంట్లు

జనరల్ నోటీస్

కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం పూడిచెర్ల గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నెంబర్ ఐ.పి. లో అర్జీదారు అయిన పి. మహమ్మద్ ఖాసీం తండ్రి పి.సాలన్న ఆటోడ్రైవర్, ఇంటి. నెంబరు. 4-7, పూడిచర్ల గ్రామం, ఓర్వకల్ మండలం, కర్నూలు జిల్లా అను నతడు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాళా అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా ఏమైనా ఆక్షేపన ఉన్న 03-08- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ 03- 08 -2023

సి.లోకేశ్వరయ్య,
సి.శాంతమూర్తి,
సి.పవన్ కుమార్,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- గురువులను సన్మానించి, జ్ఞాపకాలు నెమరు వేసుకున్న మిత్రులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలను వీడి 25 ఏళ్లయిన సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకొని తమ కుటుంబ వివరాలను ఒకరికొకరు పంచుకొని గతకాలపు బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అలాగే ఆనాడు తమకు చదువులు చెప్పిన గురువులు మాధవస్వామి, వెంకటరమణ, జానకి రాముడుతో పాటు తమకు ట్యూషన్‌లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులైన జెఉస్మాన్, రహమతుల్లా, సుబ్రమణ్యం, గిప్సన్, వీరన్న, అప్పుడు పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బందిగా పని చేసిన కౌలుట్లయ్య, ఖాసీం వలీని శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా 'నేస్తం' అనే ఒక స్వచ్ఛంద సంస్థను రిజిస్టర్ చేసుకొని దాని ద్వారా ఇక మీదట సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు రవికుమార్ నాయుడు, మద్దికెర రంగస్వామి, బండా రమేష్, కె.రంగముని, కె.కృష్ణ, ఎం.మునిరంగడు, శివరాం నాయుడు పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

వివాహా, గృహ ప్రవేశ వేడుకల్లో రాంపురం రెడ్డి సోదరులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలో జరిగిన పలు శుభ కార్యక్రమాలకు రాంపురం రెడ్డి సోదరులు హాజరయ్యారు. ఆదివారం స్థానిక దుర్గారమణ హెచ్ఆర్‌బి కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకల్లో వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి, తుంగభద్ర గ్రామంలోని రాఘవేంద్రస్వామి మఠం జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక జగనన్న కాలనీలో శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఉద్యోగి రాఘవేంద్ర నూతనంగా నిర్మించిన ఇంటిని, స్థానిక రాఘసుధ లాడ్జి వెనుక ఇంజినీర్ శ్రీనివాసులు నిర్మించిన గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సత్యనారాయణ స్వామి పూజలో ప్రసాదం స్వీకరించారు. తుంగభద్ర గ్రామంలో హ్యాండిక్యాప్ ఎటిఎమ్‌ను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రారంభించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బూదూరు వారి పెళ్లి వేడుకల్లో ప్రముఖ నాయకులు

మంత్రాలయంలోని హెచ్ఆర్‌బి కల్యాణ మండపంలో జరిగిన బూదూరు వారి పెళ్లిలో ప్రముఖ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బూదూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి కుమార్తె లక్ష్మీదుర్గ, విదునందన్ రెడ్డి వివాహ వేడుకలకు కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతారామిరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, బూదూరు లక్ష్మీకాంత రెడ్డి హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కరెంట్ కోతలు కనపడడం లేదా..?

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో కరెంట్ కోతలు కనపడడం లేదా అంటూ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. కరెంట్ కోతల విషయంలో వైసిపి నాయకుల తీరుపై, సాక్షి పత్రిక కథనాలపై మండిపడ్డారు. ఆదివారం తన నివాసం ముందు ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురితమైన కోతల్లేని కరెంట్ పేపర్‌ను చింపి తన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాక్షి పేపర్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, వారి నాయకుల అబద్దాలను నిజాలుగా ప్రచారం చేసే టిష్యూ పేపర్‌గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. సాక్షి పేపర్ పేరును నిస్సాక్షి పేపర్‌గా మార్చుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు జగన్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చాక కరెంట్ చార్జీలు పెంచబోమని, పూర్తిగా తగ్గిస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత 7 సార్లు కరెంటు చార్జీలు పెంచారని తెలిపారు. రాష్ట్రంలో కరెంట్ కోతలతో, తీవ్ర ఉష్ణోగ్రతలతో, ఉక్కపోతలతో ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి మిగులు విద్యుత్ ఉండేదని గుర్తు చేశారు.



నిరసన తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ, టిడిపి కార్యకర్తలు

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా

- జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని, లోపాలను ప్రశ్నిస్తే భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదని జనసేన పార్టీ నాయకులు మహేష్ యాదవ్, రాజశేఖర్, విజయ్ కుమార్, జయరాం విమర్శించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉన్న వారిని విమర్శించడం, ప్రశ్నించడం సహజమన్నారు. చిన్న లోపాలను కూడా సోషల్ మీడియాలో ఎత్తి చూపితే దాడులకు దిగి భయాందోళనకు గురి చేయడం వైసిపి నాయకులకు పరిపాటిగా మారిందని తెలిపారు. ఆదోనిలో తాను ఎలాంటి భూ కబ్జాలకు పాల్పడలేదని, దమ్ము, ధైర్యం ఉంటే ప్రమాణం చేయాలని ఇటీవల టిడిపి నాయకుడు ఉమాపతి నాయుడు విసిరిన సవాలుకు సమాధానం ఇవ్వకుండా వైసిపి నాయకులు సైలెంట్ కావడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్ల చులకన భావనతో మాట్లాడుతూ అసభ్య పదజాలం వాడి దాడికి యత్నిస్తూనే ఉన్నారని, తాము కూడా తిప్పి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ యాదవ్

'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'తో సొంతింటి కల సాకారం

- జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి, వెబ్ సైట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌తో ప్రతి మధ్యతరగతి సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, కుడా ఛైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి, వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆధునిక వసతులతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇలాంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యతరగతి ప్రజలు ఎలాంటి మోసాలకూ గురికాకుండా వారికి సొంత ఆస్తిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఎంఐజి లేఅవుట్ పేరుతో జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కుడా ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీల పరిధిలో స్మార్ట్ టౌన్ షిప్‌ను బనవాసి వద్ద 110 ఎకరాల్లో దాదాపు 1106 ప్లాట్లను ప్రభుత్వ లేఅవుట్ అప్రూవల్‌తో సిద్ధం చేశామని చెప్పారు. స్థలాలను కొనే వారికి, ఉద్యోగులకు, పింఛనర్లకు కుడా రిబేట్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఒకేసారి డబ్బులు చెల్లిస్తే ఎంతో లబ్ధి చేకూరుతుందని, స్థలానికి సంబంధించిన మొత్తం డబ్బులు ఒకేసారి చెల్లిస్తే సంపూర్ణ హక్కుతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అందిస్తామని వివరించారు. కుడా వైస్ ఛైర్మన్ ఎ.భార్గవ్ తేజ్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు, తహశీల్దార్ జయన్న, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపల్ కమిషనర్లు ఎన్.గంగిరెడ్డి, రఘునాథ్ రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్. నెంబరు. 1044/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైల్ అసెట్స్ స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్రెడిట్ సెల్ (RASMECC) కర్నూలు రెప్. బై ఇట్స్ మేనేజర్ డి.రమేష్ రెడ్డి.
...వాది

-ఎదురి-

సౌదాగర్ ఖాజా షెహ్రన్ ఉజ్ జామా వగైరా.

...ప్రతివాదులు

1,2, ప్రతివాదులకు దావా సమన్లు.

1.సౌదాగర్ ఖాజా షెహ్రన్ ఉజ్ జామా తండ్రి సౌదాగర్ ఖాజా జమీల్ జామా ఇంటి. నెం. 9-33, పింజరి వీధి, పూల బజార్, కర్నూలు.
2.సౌదాగర్ ఖాజా రిహాన్ ఉజ్ జమా తండ్రి సౌదాగర్ ఖాజా జమీల్ ఉజ్ జమా ఇంటి. నెం. 9-33, పింజరి వీధి పూల బజార్, కర్నూలు.

పై నెంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తం రూ. 6,97,764/- ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ఒకటి,రెండు ప్రతివాదులైన మీకు ఆక్షేపం ఉన్న 30-06- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది. 30-6-2023

ఎస్. షకీల్ అహ్మద్,
వాదిపరం అడ్వకేట్,
కర్నూలు.

సోమన్న విరచిత 'పాలుతేనెలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన కొత్త పుస్తకం 'పాలుతేనెలు' బాలగేయాల సంకలనం అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా కర్నూలులోని టిజివి కళాక్షేత్రంలో ఆదివారం ఆవిష్కరించారు. కవితాగానం అనంతరం బాలసాహిత్యవేత్త సోమన్నను సన్మానించారు.

విలేకరి శాంతప్ప మృతి

- పలువురు సంతాపం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, ఎమ్మిగనూరు టివి9 సిఇఒ విలేకరి శాంతప్ప గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఉదయం తన నివాసంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో శాంతప్ప అక్కడికక్కడే మృతి చెందారు. శాంతప్ప ఎస్ఎఫ్ఐ నాయకులుగా, డివైఎఫ్ఐ, ప్రజా నాట్యమండలి కళాకారుడుగా, సిపిఎం కార్యకర్తగా పనిచేశారు. అలాగే సుదీర్ఘకాలం ప్రజాశక్తి విలేకరిగా పనిచేశారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి, గౌస్ దేశాయ్, రామాంజనేయులు, గోవిందు, రాధాకృష్ణ, హనుమంతు, రాముడు, లక్ష్మీ నరసయ్య, డివైఎఫ్ఐ నాయకులు సురేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు గోరంట్లప్ప, మద్దిలేటి, తాలూకా నాయకులు షబ్బీర్, చంద్రశేఖర్, దేవేంద్ర మూర్తి, గౌస్, ఎపియుడబ్ల్యుజె శ్రీనివాస నాయుడు, పరమేష్ సంతాపం తెలిపారు. ఆయన మృతి జర్నలిస్టులకు తీరని లోటని తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

ఆదోని : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆదోని మైనార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనార్టీ ఛైర్మన్ ఎమ్‌డి.నూర్ మాట్లాడారు. నాయకులు బి.తాయన్, ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు జయరాం, మైనార్టీ ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, మండల అధ్యక్షులు హనుమంతు, మండల ఉపాధ్యక్షులు కుప్పగల్ అయ్యప్ప, నాగరాజు పాల్గొన్నారు.

కౌలు రైతుకు కష్టమే..!

- పంట రుణాలు ఇవ్వని బ్యాంకులు
- అందని ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి పంట పండించే రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. జీవనాధారం కోసం వ్యవసాయంపైనే ఆధారపడిన కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాల ఖర్చులు పెరగడం, భూయజమానులు కౌలు ధర పెంచుతుండడం వారి పాలిట శాపంగా మారుతోంది. సాగు భారం అధికమైందని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు జిల్లావ్యాప్తంగా సుమారు 25 వేలకు పైగా కౌలు రైతులు ఉన్నట్లు అనధికారిక సమాచారం. ప్రభుత్వం వద్ద అధికారికంగా కౌలు రైతులకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ లేవు. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందడం లేదు. కౌలు రైతులకు కనీసం బ్యాంకుల్లో రుణాలందే వీలు కూడా లేదు. ఎలాంటి ఆధారమూ లేకపోవడంతో ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలకు కౌలు రైతులు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రైతు భరోసా, పంటలు నష్టపోయినప్పుడు ప్రభుత్వం అందజేసే నష్టపరిహారానికీ దూరమవుతున్నారు. వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడి అప్పులు చేసి రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు.



భూయజమానుల నుంచి ఒప్పందం

కౌలు రైతులు ముందుగానే భూయజమానుల నుంచి ఒప్పందం చేసుకుని వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. నాలుగేళ్ల నుంచి ఎకరా భూమికి ఏటా రూ.2 వేల వరకు పెరుగుతోంది. ప్రస్తుతం ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలు ఇస్తున్నారు. ఆపై కౌలు రైతులకు పెట్టుబడి భారం తప్పడం లేదు. రాష్ట్రంలో క్రాప్ బుకింగ్ పోర్టల్ వ్యవస్థ నేపథ్యంలో కౌలు రైతులు సాగు చేస్తున్నా భూయజమానుల పేరిట పంటల వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేస్తున్నారు. మద్దతు ధరకు ప్రభుత్వం పంటలను కొనుగోలు చేసేటప్పుడు భూయజమానుల ఖాతాల్లోనే డబ్బులు పడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో కొందరు తమ ఖాతాల్లో పడిన పంట డబ్బు నుంచి కౌలు సొమ్మును ముందుగానే మినహాయించుకుని మిగిలిన డబ్బును కౌలు రైతులకు ఇస్తున్నారు.

ఎకరాకు రూ.10 వేలిచ్చి కౌలు చేస్తున్నా

- ఈరన్న, ధణాపురం గ్రామం, ఆదోని మండలం

కుటుంబాన్ని పోషించుకునేందుకు నాకున్న ఎకరా భూమితోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకున్నాను. ప్రస్తుతం ఎకరాకు రూ.10 వేలు ఇస్తున్నాను. కౌలు రైతులు నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందడం లేదు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

బ్యాంకు రుణాలివ్వడం లేదు

- రంజాన్, పెద్దహరివాణం గ్రామం, ఆదోని మండలం

బతుకుదెరువు కోసం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. ప్రతేడాది భూములకు కౌలు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రుణాల కోసం బ్యాంకుల వద్దకు వెళితే కౌలు రైతులకు బ్యాంకు అధికారులు రుణం ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. వ్యాపారుల వద్దకు వెళ్లి పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకొచ్చి సాగు చేస్తున్నాం. ఎన్ని ఇబ్బందులు ఏర్పడినా తప్పనిసరి పరిస్థితిలో వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. ప్రత్యేకంగా గుర్తింపుకార్డులు అందజేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి.

మహారాజశ్రీ కర్నూలు ఒకటవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
ఓ.యస్.నెంబర్.28/2021

గొల్ల శ్రీనివాసులు యాదవ్ వగైరా.
...వాదులు

-ఎదురి-

గొల్ల లక్ష్మీదేవి వగైరా. ...ప్రతివాదులు

7 మరియు 11 ప్రతివాదులకు దావా సమన్లు

(7). జి.జయమ్మ భర్త అయ్యన్న ఇంటి. నెంబరు. 1-299, మేడంవారి వీధి, కర్నూలు.
(11). వెంకటేశ్వరమ్మ భర్త వెంకటేశ్వర యాదవ్ కేరఫ్ వెంకటేశ్వర యాదవ్, కండక్టర్, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి, మారుతి వీధి, ఆదోని

పై నెంబరు దావాలో వాదులు షెడ్యూల్ దాఖాలా ఆస్తిని 1వ ప్రతివాది 2,3 ప్రతివాదుల పేర వ్రాయించి ఇచ్చిన దాన విక్రయములు దస్తావేజు నంబరు. 37 1 9/ 2 0 2 1, 3 7 20/2021, తేదీ 15-3-2021 రద్దు చేయమని సదురు దస్తావేజు లేటు గోల్ల చిన్నమ్మ అలియాస్ గొల్ల చిన్నక్క వారసులకు వ్రాయించినది. (2) సదురు ఆస్తిపైన 1/5 వ భాగము గొల్ల చిన్నక్క వారసులు నలుగురు కుమారులు ఒక కుమార్తెకు పంచమని. (3) సదరు ఆస్తికి కమీషనర్ ను నియాయమించి కమీషనర్ చే విభాగాలు చేయమని ఫైనల్ డిగ్రీ కోరుతూ మీన్ ప్రాఫిట్స్ కొరకు మరియు దావా ఖర్చులు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినారు. ఇందులో 7 మరియు 11 ప్రతివాదులైన మీకు ఆక్షేపణ ఉన్న 23-6-2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపని వలెను లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూల్ :- షెడ్యూలు
A షెడ్యూలు కర్నూలు జిల్లా కర్నూలు సబ్ జిల్లా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నెంబర్.76, యాదవ నగర్ ఏరియా, కల్లూరు గ్రామ విలేజ్, సర్వే నెంబర్.299/1 ఏ అండ్ 299/3 ఏ,
ఎక్స్ టెంట్ : 0.30 సెంట్లు
హద్దులు :- తూర్పు : శ్రీనివాస ఆయిల్ మిల్లు
పడమర :- 30 అడుగుల రోడ్డు
ఉత్తరం :- జి.కృష్ణకుమారి పొలము
పడమర:- సర్వే.నెంబర్.298 గల పొలం.
B.షెడ్యూల్ రెండవ రెస్పాండెంట్ కు బహుమతిగా ఇచ్చిన పొలము.
కర్నూలు జిల్లా కర్నూలు సబ్ జిల్లా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నెంబర్. 76, యాదవ నగర్ ఏరియా, కల్లూరు గ్రామ విలేజ్,
సర్వే నెంబర్.299/1 ఏ అండ్ 299/3 ఏ,
ఎక్స్ టెంట్ : 694.09 స్క్వేర్ యాడ్స్
హద్దులు :- తూర్పు : శ్రీనివాస ఆయిల్ మిల్లు
పడమం :- 30 అడుగుల రోడ్డు
ఉత్తరం :- జి.కృష్ణకుమారి పొలము
పడమర :- యోగేశ్వర్ యాదవ్ పొలం.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు

వాయిదా తేది 23-6-2023

ఎం. శ్రీనివాసన్,
పి.జనార్దన్ రెడ్డి వాదుల పరం అడ్వకేట్లు, కర్నూలు.

'28న అండర్19 కబడ్డీ పోటీలు'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్, అరులయ్య గుడి వెనుక పెద్ద మాదిగ గేరి వద్ద ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఫిలిప్స్ టీచర్ 7వ వర్ధంతి సందర్భంగా అండర్-19 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం విలేకరులకు తెలిపారు. 28న ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల్లోపు ముగిస్తారని తెలిపారు. మొదటి బహుమతి రూ.2 వేలను ఎస్.అమర్ ప్రకాష్, రెండో బహుమతి రూ.1000 ఉలిద్ర రవి కుమార్ స్పాన్సన్ చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో రూ.200 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారుల బరువు 65 కిలోలలోపు ఉండాలని, అంపైర్ నిర్ణయమే తుది నిర్ణయమని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి భోజన వసతి ఉండదన్నారు. వివరాలకు 6300971994, 8074757494, 7799058816 సంప్రదించాలని కోరారు.

చదువుతోపాటు వ్యాయామం తప్పనిసరి

- కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నటరాజ్ స్వామి

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు చిన్నారులకు వ్యాయామం తప్పనిసరిగా ఉన్నప్పుడే శరీరం దృఢంగా తయారై ఆరోగ్యంగా ఉంటారని కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నటరాజ్ స్వామి, వ్యాపారవేత్త, టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అప్సర్ బాష తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో కళాభారత్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందుతున్న చిన్నారులకు పలు రకాల మెటీరియల్ అందజేశారు. అంతకుముందు తస్లీమా అనే విద్యార్థిని యోగా, కరాటేలో పలు ఆసనాలు, భంగిమలు ప్రదర్శించారు. చిన్నారి చూపిన ప్రతిభను మెచ్చుకున్న దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కళాభారత్ సేవా సమితి ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా యువత ఆత్మరక్షణ కోసం యోగా, కరాటే, బాక్సింగ్, కర్రసాము వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. పాఠశాల ప్రాంగణంలో వేసవిలో స్కూల్ విద్యార్థులకు శరీర దృఢత్వం కోసం శిబిరం ఏర్పాటు చేయడం శుభ పరిణామమని తెలిపారు. తమవంతుగా కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్, దేశాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువ చేసే క్రీడా పరికరాలను విరాళంగా అందజేశారని చెప్పారు. భవిష్యత్తులో కళాభారత్ సేవా సమితి వారికి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం దాతలకు కళాభారత్ సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. దేశాయి ఫౌండేషన్ పవన్ భార్గవ్ దేశాయి, విశ్రాంత ఉపాధ్యాయులు దేవప్రసాద్, అల్లు అర్జున్, పట్టణ అధ్యక్షులు చంద్ర రాయల్, శిక్షకులు కేశవ, మాస్టర్ కుమార్ గౌడ ఉన్నారు.



ప్రతిభ కనబరిచిన తస్లీమాకు నగదు అందజేస్తున్న అప్సర్ బాష

బీసీల్లో రాజకీయ చైతన్యం కావాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఓటు బ్యాంకుగా కాకుండా రాజ్యాధికారం దిశగా, బీసీలు హక్కుల సాధనకు ఐకమత్యంతో పోరాడాల్సిన అవసరం ఉందని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో దస్తగిరి నాయుడు అధ్యక్షతన బీసీ ఫెడరేషన్ డివిజన్ నూతన కార్యాలయాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లాడారు. బీసీలు ఐకమత్యంతో ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రాజకీయంగా ఎదగాలని రాబోయే, ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల్లో బీసీ కులాల వారు ఎమ్మెల్యేలుగా పోటీకి సిద్ధం కావాలని తెలిపారు. కమిటీ మాజీ సభ్యులు గుడిసె కృష్ణమ్మ, బిజెపి నాయకులు ప్రకాష్ జైన్, ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ సభ్యులు, బీసీ నాయకులు, బీసీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, గౌరవ సలహాదారులు ధణాపురం శేషన్న, దేవిశెట్టి ప్రకాష్, తాలూకా అధ్యక్షులు మరియాని చెన్న బసప్ప, జనరల్ సెక్రటరీ రమేష్ ఆచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.షేక్షావలీ, గౌరవ సలహాదారులు బండ రాజేశ్వరరావు, కపటి వీరభద్ర, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు, బి.రాముడు, డి.శ్రీనివాసులు, నాగార్జున్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



విట్టా రమేష్‌ను సన్మానిస్తున్న నాయకులు





నేల రాలిన కాయలను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రైతు ప్రతినిధులు

గాలివాన బీభత్సం

- బండి ఆత్మకూరులో పిడుగు పడి వ్యక్తి మృతి..
మరొకరికి గాయాలు - అవుకులో గడ్డివామి దగ్ధం
- ఆత్మకూరులో వడగండ్ల వాన - రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు/అవుకు/బండి ఆత్మకూరు

జిల్లాలోని అవుకు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం బండి ఆత్మకూరులో పిడుగు పడి పశువుల కాపరి సాని బోయిన వెంకటేశ్వర్లు (60) మృతి చెందాడు. మరొకరికి గాయలయ్యాయి. అలాగే అవుకు మండలం కునుకుంట్ల గ్రామంలోని ఎస్సి కాలనీలో పిడుగు పాటుకు రైతు లక్షుంపల్లె పుల్లన్నకు చెందిన గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకోవడంతో గాలితోపాటు ఉరుములు మెరుపుల వాన కురిసింది. సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో పక్కనే ఉన్న గడ్డివామిలో మంటలు చెలరేగాయి. బనగానపల్లె అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరడంతో



ఆత్మకూరు మండల కేంద్రంలో వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొనేలోపే గడ్డివామీ పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. దగ్ధమైన గడ్డివామి విలువ సుమారు రూ. 60,000 ఉంటుంది. ఈ నష్టాన్ని ఎలా భరించాలని రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆత్మకూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు వడగండ్ల వాన పడుతుండడంతో ఇండ్లలో ఉన్న పిల్లలు ఆశ్చర్యంగా వడగండ్ల సేకరిస్తూ ఆనందంతో కేరింతలు వేశారు. గంటసేపు కురిసిన వర్షానికి ఆత్మకూరు పట్టణంలోని పలుకాలనీలలో రోడ్లపై వర్షపునీరు నిలబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరైన డ్రైనేజ్ లేకపోవడంతో ఏ కొద్దిపాటి వర్షానికి కాలనీలో నీళ్లు నిలబడిపోవడం పరిపాటిగా మారింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమికి కరెంటు కోతకు ఇబ్బందులు పడ్డ ప్రజలు వర్షం పడటంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో వడగళ్లలో కూడిన వర్షం కురిసింది.

బండి ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన సాని బోయిన వెంకటేశ్వర్లు (60), లక్ష్మీ రెడ్డితో కలిసి కెసి కెనాల్ పక్కన జింకలబరక ప్రాంతంలో పశువులను మేపుతుండగా మధ్యాహ్నం తీవ్రమైన గాలుల వర్షం, ఉరుములు, మెరుపులు వచ్చాయి. సమీపంలో పిడుగు పడడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మీరెడ్డి స్పృహ కోల్పోయి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి చేరుకుని మృతి చెందిన వెంకటేశ్వర్లును భోరున విలపించారు. స్పృహ కోల్పోయిన లక్ష్మీరెడ్డిని కుటుంబ సభ్యులు నంద్యాల కెవిఆర్ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

మామిడి రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారమివ్వాలి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - ఆత్మకూర్

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన గాలి, వడగండ్ల వానల వల్ల నష్టపోయిన మామిడి తోట రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అమలాపురం గ్రామంలో గాలివానకు నష్టపోయిన మామిడి తోటలను ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివన్న గత 25 సంవత్సరాల నుంచి మామిడి తోట మీద ఆధారపడి కుటుంబాన్ని పోషించు కుంటున్నాడని, గాలివానకు సంవత్సరంలో మూడు నాలుగు సార్లు నష్టపోతే అప్పుల పాలవుతారని తెలిపారు. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. అలాగే మరో మామిడి రైతు నారాయణ గత 20 సంవత్సరాల నుంచి తోట మీద ఆధారపడి బతుకుతున్నాడని, ఈదురుగాలులు, వర్షాల వల్ల నష్టపోవడంతో అప్పులపాలై కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హార్టికల్చర్ అధికారులు ఇప్పటివరకు కూడా నష్టపోయిన మామిడి తోట రైతులను పరిశీలించిన పాపానా పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన మామిడి తోటలు పరిశీలించి ఎకరాకు రూ. లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు ఏ.రణధీర్, అంబయ్య, మండల కార్యదర్శి వీరన్న, సిఐటియు కార్యదర్శి రామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.స్వాములు, మామిడి రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ సంతకం ఫోర్జరీ

- ఆరెకరాల వక్ఫ్ బోర్డు భూమి కబ్జా

ప్రజాశక్తి - మహానంది

నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంతకం ఫోర్జరీ చేసి వక్ఫ్‌బోర్డు భూమి ఆరు ఎకరాలు కబ్జా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మహానంది మండలం బొల్లవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వక్ఫ్ బోర్డు భూమి 486 సర్వే నెంబర్‌కు సంబంధించి రెండు ఎకరాల 86 సెంట్లతో పాటు మరో మూడున్నర ఎకరాలు మొత్తం దాదాపు 6 ఎకరాలు పైనే కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నాడు. విషయం తెలిసిన నంద్యాల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేయాలని స్థానిక తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ జనార్ధన్ శెట్టిని వివరణ కోరగా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసింది వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని, నిందితులపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

లోన్ యాప్‌లు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

- ప్రజలను అప్రమత్తం చేయండి : ఎస్పి కె.రఘువీర్ రెడ్డి



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

లోన్ యాప్‌ల మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డోన్ సబ్ డివిజన్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని ఆదేశించారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్‌పిసి తదితర కేసులను సమీక్షించారు. మిస్సింగ్ కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించా లని త్వరితగతిన కనుగొనేలా చేయాలని ఆదేశించారు. అరెస్టులు, చార్జ్ షీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా చూసుకోవాలని, వాటికి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్షాధారాలు ప్రవేశపెట్టి శిక్ష పడేలా చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. హత్య, పోక్సో, రేప్ కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలన్నారు. మహిళల, చిన్నారుల అదృశ్యం కేసులలో అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వారిని పట్టుకొనడంలో నిబద్ధత చూపించాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తూ ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. లారీ అసోసియేషన్ వారితో మాట్లాడి కంటైనర్ భారీ వాహనాలకు సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని వివరించి అవగాహన కల్పించాలని, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని పాపిలాన్ పరికరం ద్వారా వారి వేలి ముద్రలను తనిఖీ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జె.వి.సంతోష్, సిఐ దస్తగిరిబాబు, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో సిఐ జయరాములు, ఎస్ఐలు అశోక్ ,రమేశ్ బాబు పాల్గొన్నారు.

యువగళం... జనసంద్రం

- బనగానపల్లె నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర
- కోవెలకుంట్లలో ఘన స్వాగతం

ప్రజాశక్తి-బనగానపల్లె/కోవెలకుంట్ల

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం బనగానపల్లె నియోజకవర్గంలో సాగింది. బనగానపల్లె మండలం అమడాలమెట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్ర సౌదరదిన్నె, కోవెలకుంట్ల, భీముని పాడు, కంపమల్ల మెట్ట నుండి ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడు విడిది కేంద్రం వరకూ సాగింది. సౌదరదిన్నె రైతులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. అకాల వర్షాలకు మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదని తెలిపారు. వ్యవసాయ పెట్టుబడులను తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కోవెలకుంట్ల అమ్మవారిశాల వద్ద ఆర్యవైశ్యులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి నిమ్మ, దానిమ్మ, బత్తాయి, ఖర్జూర, బొప్పాయి వంటి వాణిజ్య పంటల ఎగుమతికి అవకాశం కల్పిస్తే వ్యాపారులకు మేలు జరుగుతుందని లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చాకా ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కోవెలకుంట్లలో కుందూనది పోరాట సమితి నాయకులు లోకేష్‌ను కలిశారు. కుందూనదిని ప్రభుత్వం లోతు, వెడల్పు చేయడం వల్ల ఎండాకాలంలో నీరు నిల్వ ఉండటం లేదని తెలిపారు. చెక్ డ్యాములు నిర్మించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జొలదరాశి, రాజోలి రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేస్తామని, కుందూ పరివాహక ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు తీరుస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పాదయాత్ర సందర్భంగా కోవెలకుంట్ల జనసంద్రంగా మారింది. లోకేష్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డు పక్కన బారులు తీరారు. ఉపాధి హామీ ఉద్యోగులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందని, జీతాల్లో కోత విధించారని తెలిపారు. ఉపాధి హామీ ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు అమడాలమెట్ట విడిది కేంద్రం వద్ద మైనింగ్ యజమానులు, కార్మికులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ మైనింగ్ కార్మికులకు మెరుగైన జీతాలు, ఆరోగ్య బీమా, ఈఎస్ఐ సదుపాయం, ప్రమాద బీమా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కోవెలకుంట్లలో బిజెపి నాయకులు సునీల్ చల్ రెడ్డి వారి మిత్రబృందంతో లోకేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. గడ్డం బ్రదర్స్ ఆధ్వర్యంలో నారా లోకేష్, బీసీ జనార్ధన్ రెడ్డిలకు గజమాలతో ఆహ్వానం పలికారు. ఈ పాదయాత్రలో బనగానపల్లె నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి బిసి.జనార్ధన్‌రెడ్డి, డోన్ ఇంఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, నందికొట్కూరు ఇంఛార్జి మాండ్ర శివానందరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, గడ్డం అమర్నాథరెడ్డి, అమడాల మద్దిలేటి, వల్లంపాడు సర్పంచి జగదీశ్వర్ రెడ్డి, ఎంపిటిసి కత్తి సురేష్ బాబు, బిజినవేముల డి.హుస్సేనయ్య, చిలమకూరి వెంకట సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, మోహన్ రెడ్డి, చిన్న కొప్పెర్ల వెంకట సుబ్బారెడ్డి, వల్లంపాడు నారాయణరెడ్డి, కలుగొట్ల అర్జున్ రెడ్డి, కంపమల్ల సుబ్బారెడ్డి, పొట్టిపాడు సుబ్బారెడ్డి, కులాయి భాష, మురళి, హరి, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పాదయాత్రలో నారా లోకేష్ వెంట బిసి జనార్ధన్‌రెడ్డి, నాయకులు



మైనింగ్ యజమానులు, కార్మికులతో ముఖాముఖి మాట్లాడుతున్న నారా లోకేష్



యువగళం పాదయాత్రలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న గడ్డం బ్రదర్స్

యువగళంలో గడ్డం బ్రదర్స్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో గడ్డం బ్రదర్స్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆదివారం సాయంత్రం కోయిలకుంట్ల మండలంలోని ఆమడాల మెట్ట వద్ద నుండి లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు గడ్డం అమర్నాథరెడ్డి, గడ్డం అశోక్ వర్ధన్ రెడ్డిలు పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

వేర్వేరు గ్రామాల్లో కుక్కల దాడి

- ఇద్దరు చిన్నారులకు గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఆదివారం కుక్కల దాడిలో కడప జిల్లా కొత్రపాడు గ్రామానికి చెందిన హిమజకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే చాగలమర్రి పట్టణంలోని ఒకటో వార్డులో కుక్క దాడిలో యూసూఫ్ అనే బాలుడికి గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరు చిన్నారులకు చాగలమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు అందించారు. వైఎస్ఆర్ కడప జిల్లా కొత్రపాడుకు చెందిన రామ్మోహన్ కుమార్తె హిమజ ద్విచక్రవాహనంలో క్రిష్ణాపురం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా గొడిగనూరు చేరుకోగానే కుక్కలు ద్విచక్రవాహనం వెంటబడి చిన్నారిపై దాడి చేశాయి. చిన్నారి కాలుకు తీవ్ర గాయా లయ్యాయి. చాగలమర్రిలో ఆడుకుంటున్న యూసుఫ్‌ను కుక్క కరిచింది. ఇద్దరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.



గాయపడిన చిన్నారులు

అభివృద్ధి జరగలేదనడం హాస్యాస్పదం

- బహిరంగ చర్చకు ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధమే
- బిసికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సవాల్

ప్రజాశక్తి - బనగానపల్లె

యువగళం పాదయాత్రలో లోకేష్, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొనడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం బనగానపల్లెలో జరిగిన బహిరంగ సభలో సిఎం జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని నారా లోకేష్ కమీషన్ల రామిరెడ్డి అని చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో, బహిరంగ సభలో టిడిపి అధికారంలోకి వస్తే ఏం చేస్తారో వివరించాల్సింది పోయి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యేను ఎద్దేవా చేయడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. బహిరంగ సభలో బనగానపల్లె నియోజకవర్గంలో తాను కమీషన్లు తీసుకుంటున్నానని నారా లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బిసి జనార్ధన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే టిడిపి కార్యకర్తలు చేసిన పనులకు కమీషన్లు తీసుకున్నారని విమర్శించారు. పట్టణంలో మైనారిటీల షాదీఖానాకు బిసి జనార్ధన్ రెడ్డి రూ.30 లక్షలు ఇచ్చారని నిన్న బహిరంగ సభలో చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని అన్నారు. ఆయన ఇచ్చిన డబ్బును మళ్ళీ టిడిపికి చెందిన మైనార్టీ నాయకుడు కలాం పేరు మీద విత్ డ్రా చేసుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. డబ్బులు విత్‌డ్రా చేసుకున్న ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని బిసి జనార్ధన్ రెడ్డికి ఎమ్మెల్యే సవాల్ విసిరారు. తాను కమీషన్లు తీసుకున్నానని పదేపదే లోకేష్ చెప్పారని, రుజువు చేసే దమ్ము లోకేష్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, నాయకులు అత్తార్ జాహిద్ హుస్సేన్, బండి బ్రహ్మానంద రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరుడ దీవెనమ్మ, జడ్పిటిసి లక్ష్మీసుబ్బమ్మ, నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

డోన్‌లో ఫోర్ కోర్టుల భవన నిర్మాణానికి ఉత్తర్వులు

- రూ.23.53 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-డోన్

డోన్‌లో ఫోర్‌కోర్టు భవన సముదాయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 23.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు విడుదల చేయించారు. ఈమేరకు జిఒ ఆర్‌టి నెంబర్ 2197 ప్రకారం ఆర్థిక శాఖ, న్యాయశాఖ 2023 ఏప్రిల్ 27న నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈనెల 5న న్యాయపరమైన ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఆదివారం పూర్తి స్థాయిలో ఉత్తర్వులు విడలయ్యాయి. డోన్‌లో ఇప్పటికే సబ్‌కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మొత్తం మూడు కోర్టులున్నాయి. నంద్యాల జిల్లా అయిన నేపథ్యంలో డోన్ డివిజన్ కేంద్రంలో భవిష్యత్తులో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు వచ్చే అవకాశం ఉన్నందున నాలుగు కోర్టుల సముదాయం ఒకేదగ్గర ఉండేలా భవనాన్ని నిర్మించనున్నారు. నాలుగు కోర్టులతో పాటు నలుగురు న్యాయమూర్తుల చాంబర్లు, బార్ అసోసియేషన్ ,ఇతర భవనాలకు సరిపడా నిధులు మంజూరయ్యాయి. ఫోర్‌కోర్టుల సముదాయానికి రూ.23.50 కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి బార్ అసోసియేషన్ డోన్ అధ్యక్షులు , ఎంపిపి రేగడి రాజశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు, డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ వేర్వేరు ప్రకటనలలో కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు మంజూరుకు కృషి చేయాలని ముఖ్యమంత్రిని, ఆర్థిక శాఖ మంత్రిని కోరారు.



ఫోర్‌కోర్టు భవన సముదాయం మోడల్

ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతం

- 1200 మందికి పరీక్షలు
- 120 మందికి శస్త్ర చికిత్సలకు గుర్తింపు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుభాశీస్సులతో డోన్ మున్సిపాలిటీ , విశ్వభారతి వైద్య కళాశాల, జనరల్ హాస్పిటల్ వారు సంయుక్తంగా ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో 33 మంది డాక్టర్లు పాల్గొని 1200 మందికి ఒపీ తీసుకొని డాక్టర్లను ప్రజలు సంప్రదించి వైద్యం చేయించుకున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. టుడి ఇకో, ఇసిజి, స్కానింగ్ ఉచితంగా నిర్వహించారు. అందరికీ కావల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఆపరేషన్ అవసరమైన 120 మందిని గుర్తించామని, వారికి ఈనెల 24, 25, 26 తేదీల్లో బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఉచితంగా బస్సులో తీసుకెళ్లి అన్ని పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. వారికీ ఉచిత భోజన సౌకర్యం కూడా కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి వైద్య కళాశాల అధినేత కాంతారెడ్డి ,డాక్టర్ రవి కళాధర్ రెడ్డి, ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, ఎస్ఎండి.జాకీర్ హుస్సేన్, సచివాలయాల కన్వీనర్ కురుకుంద హరి, కౌన్సిలర్లు, ఎఎన్ఎంలు,ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, విశ్వభారతి మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

23న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సంజామల : సంజామల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న మండల అధ్యక్షురాలు పోచా రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నాగ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణం హనుమాన్ నగర్ కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డిపై దాడి కేసు నమోదు చసినట్లు ఎఎస్ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు. ఎఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్లలోని కర్నూలు రోడ్డులో గల అయ్యల చెరువు బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర మహబూబ్ సుభానిపై పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డి వ్యక్తిగత కారణాలతో గొడవ పెట్టుకుని దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు మహబూబ్ సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు ఆదివారం భక్తుల రద్దీ బాగా పెరిగింది. రాష్ట్రంలో ఎండలు తగ్గి చల్లబడడంతో పాటు విద్యార్థులకు సెలవు రోజులు ముగిస్తుండడం, పరీక్షలు రాసిన వాటిలో కొన్ని ఫలితాలు వెల్లడి కావడంతో స్వామి అమ్మ వార్లని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండే కాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకొని స్వామి అమ్మవారిను దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుండి స్వామి అమ్మలను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దర్శనం చేసుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు చెబుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



క్యూలో నిలబడిన భక్తులు


స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖులలో భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే కుటుంబ సభ్యులు, ఎపి రాష్ట్ర శాసనసభ గౌరవ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు ఉన్నారు. వీరు విడివిడిగా స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆ తర్వాత విడివిడిగా స్వామి వారిని ముందుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆ తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వేద ఆశీర్వచన మండపంలో వీరికి విడివిడిగా వేద పండితులు ఆశీర్వచనం పలికారు. శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను దేవస్థానం అధికారులు అందజేశారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9:30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరుకావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని శిల్పా టౌన్‌షిప్ వద్ద ఉన్న రోటరీ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం జరిగిన క్రీడాకారుల వ్యాయామ శిబిరంలో పట్టణ సిఐ జీవన్ గంగానాథ్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని తైక్వాండో క్రీడాకారులకు మెడల్స్, బ్లాక్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడాకారులు గెలిచినా, ఓడినా సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏరోబిక్స్ వ్యాయామ శిబిరంలో డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్‌లు పాల్గొని క్లాపింగ్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస్టర్ ఎల్‌టి చంద్రమౌళి, టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'యువగళం'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - చాగలమర్రి : ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈ నెల 22, 23 తేదీలలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు శేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్ర నేడు దొర్నిపాడు మండలం నుండి ప్రారంభమవుతుందన్నారు. 23వ తేదీన చింతకుంట గ్రామం నుండి ప్రారంభమై ఆళ్లగడ్డలోని పాత బస్టాండ్ బహిరంగ సభ ఉంటుందన్నారు. నాయకులు శేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రామ సుబ్బయ్య, కృష్ణ, శ్రీరాములు, బాబయ్య, నరసింహులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- పగలంతా చెట్ల కిందే కాలయాపన

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈ ఏడాది మే నెలలో నిప్పుల కొలిమిలా ఎండలు మండుతున్నాయి. ఎండలు భగభగ మంటుండడంతో పాటు గాలి లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ కూడా సక్రమంగా లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పల్లె ప్రాంతాల్లో పగలంతా ప్రజలు చెట్ల కింద కాలయాపన చేస్తూ గడుపుతున్నారు. ప్రతి సంవత్సరం ఎండాకాలం వచ్చిందంటే ప్రజలంతా సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, చెరువులను ఆశ్రయించి సరదాగా ఈత కొడుతూ ఉపశమనం పొందేవారు. అయితే ఈ ఏడాది ఎండలు విపరీతంగా


ఉక్కపోత తాళలేక ఆరుబయట కూర్చున్న యువకులు

ఉండడం, ఉదయం 10 గంటలు దాటితే సాయంత్రం 6 గంటల దాకా ఎండవేడి ఒకవైపు, మరోవైపు ఉక్క పోత ఉండడంతో ప్రజలంతా పెద్ద పెద్ద చెట్లు, నీడ ఉన్న ప్రదేశాన్ని ఎంచుకుంటూ సేద తీరుతున్నారు. ఈ ఏడాది 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు ఎండలు నమోదు కావడంతో ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రజలు ఎండల భారీ నుండి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకటనల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రజలు తమ పనులను ఉదయం 10 గంటల లోపల ముగించుకొని మధ్యాహ్నం అంతా చల్లటి నీడ ఉన్న ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకొని సాయంత్రం 6 గంటలకు పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వైద్యాధికారులు పలు సందర్భాల్లో తెలియజేస్తున్నారు. మండుతున్న ఎండలు ఒకవైపు ఉంటే మరోవైపు పల్లె ప్రాంతంలో సమయ వేళలు లేకుండా విద్యుత్ కోతలు ఉండడంతో ప్రజలు ఉక్క పోతకు తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అలాగే గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్ల కింద ప్రజలు కూర్చుని సమయం గడుపుతున్నారు. రహదారులు మాత్రం నిర్మానుషంగా మారుతున్నాయి. సాయంత్రం 6 దాటిన తర్వాత గ్రామాల్లో ఉన్న రోడ్లు ప్రజలతో నిండిపోతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామాల్లో ఉన్న ప్రజలందరూ వేసవిలో అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు పనులు ఉంటే ఉదయం 10 గంటలలోపు ముగించుకొని ఇళ్లలోనే ఉండాలి. మళ్లీ సాయంత్రం ఐదు గంటల నుంచి బయటకు వచ్చి పనులు చూసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఎవరు బయటకు రావద్దని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా పలు సూచనలు కూడా గ్రామాల్లో తెలుపుతున్నాం. ఎక్కువగా ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, నీటిని తీసుకోవాలి.

- వైద్యాధికారి వినోద్ కుమార్.

బయటికి రావాలంటే భయమేస్తుంది



ప్రస్తుతం ఉంటున్న ఎండలను ఎన్నడూ చూడలేదు. ఇంటి నుండి పనుల నిమిత్తం బయటికి రావాలంటే భయమేస్తుంది. ప్రతిరోజు అవసరాల నిమిత్తం పట్టణ ప్రాంతాలకు వాహనాల్లో వెళ్తున్న ప్రజలకు వడదెబ్బ సోకే అవకాశం ఉంది. మరోవైపు విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో ప్రజలకు ఉక్కపోత కష్టాలు భారీగా ఉన్నాయి.

- బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, గుమ్మడాపురం.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్ర నష్టం : రేంజర్


బండిఆత్మకూరు : పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రజలు తమ అవసరాల కోసం వినియోగించే ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్‌జా తెలిపారు. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంటల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోఇన పెసరవాయి, ఓంకారం, నెమళ్లకుంట గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రకృతికి ఎలా నష్టం కలుగుతుంది అన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవనంలో భాగంగా అనేక వస్తువులను వినియోగిస్తుంటా మని, పర్యావరణానికి ఎక్కువ నష్టం కలిగించేది ప్లాస్టిక్ అన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. ప్రకృతిని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు చెట్లు నాటాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా జ్యూట్, క్లాత్ బ్యాగులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఒలు హైమావతి, వెంకట రమణ, ఫారెస్ట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

రుద్రవరం : పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో మిషన్ లైఫ్ ఈవెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ ప్రజలకు మిషన్ జీవితం, పర్యావరణం కోసం జీవనశైలి లక్ష్యాలను ప్రజలకు వివరించారు. నీటి సంరక్షణ అవసరం, పంపు నీటిని వృధా చేయవద్దు, పట్టుకోవడం, వినియోగం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రుద్రవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగరాజు, బీట్ ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రుద్రవరం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు


ప్రత్యేక పూజలు చేస్తున్న వైసిపి నాయకుడు భూషి గౌడ్ కుటుంబ సభ్యులు

అమ్మవారికి విశేష పూజలు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో వెలిసిన మైసమ్మ దేవాలయంలో అమ్మ వారికి ఆదివారం వైసిపి నాయకులు భూషి గౌడ్ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మాపురం గ్రామానికి చెందిన ప్రజలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంవత్సరానికి ఒకసారి మైసమ్మ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో మైసమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్ గౌడ్, లలిత, జయమ్మ, నాగేంద్ర గౌడ్, హేమవతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నేతల నిరసన ర్యాలీ హాస్యాస్పదం : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు


నందికొట్కూరు పట్టణంలో వైసిపి ఎమ్మెల్యే, నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించడం హాస్యాస్పదమని, ప్రజలకు ఏదైనా సమస్య వస్తే తీర్చాల్సిన అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష నాయకులపై నిరసన ర్యాలీ నిర్వహించడం సరికాదని టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపికి దమ్ముంటే ప్రజలకు మంచి చేయాలే గాని, ప్రజల పక్షాన నిలబడిన చంద్రబాబుపైన కక్ష సాధింపు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు పాణ్యం వేణుగోపాల్, పార్లమెంట్ మైనారిటీ సెల్ కోఆర్డినేటర్ ఖాద్రి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బ్రహ్మం, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుల్లెద్దుల రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని 24వ వార్డులలో నెలకొన్న అపరిష్కృత ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్‌లు తెలిపారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపాలిటీ గ్రేడ్-2 అయిన తర్వాత పొయ్యిలో నుండి పెనంలోకి పడినట్లుగా మారిందన్నారు. పట్టణంలో ఏ వీధిలోకి పోయినా చిన్న పాటి వర్షానికి రోడ్లు చేపల చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. పట్టణంలో అనేక వీధిలలో సిమెంట్ రోడ్లు, 24 వార్డులలో డ్రెయినేజీ సిస్టం లేక ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు ఆగి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. దోమల నివారణకు పట్టణంలో ఫాగింగ్ చర్యలు చేపట్టడం లేదని, పట్టణంలో వీధి కుక్కలు చిన్నారులపై, వృద్ధులపై దాడి చేస్తున్నా మున్సిపాల్టీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. వీధులలో ప్రజలు తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. పట్టణ ప్రజలకు దాహార్తి తీర్చాలని రూ.116 కోట్లతో ప్రారంభించిన స్కీము నీటిట్యాంకులు మొండి గోడలుగా మిగిలాయి తప్ప సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మున్సిపాలిటీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రజలపై భారాలు ఎలా వేయాలి, వసూలు చేయాలనే దానిపైన చూపిన శ్రద్ధ సమస్యలపై లేదన్నారు. కనీసం మౌలిక సదుపాయాలు తీర్చడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలోని 24వ వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పట్టణ ప్రజలను సమీకరించి సిపిఎంగా మున్సిపాలిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు ఎస్.స్వాములు, ఏ.సురేంద్ర, డి.రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.యేసురత్నం


దెబ్బతిన్న ఇండ్లను పరిశీలిస్తున్న నాయకులు

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం భానుముక్కల గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన గాలివానకు భారీ వృక్షం కూలి రెండు మిద్దెలపై పడి నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భానుముక్కల గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను సిపిఎం మండల కార్యదర్శి సామన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, నాయకులు మధులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడ్డం దేవ సహాయం, గడ్డం బాలమ్మ ఇల్లు బాగా దెబ్బతిన్నాయని చెప్పారు. దేవ సహాయం పైకప్పు లేచిపోయిందని, బాలమ్మ ఇల్లు, బాత్రూం బాగా దెబ్బతిన్నాయని తెలిపారు. బాధితులకు నష్టపరిహారం రూ. 5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల : భారత మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ సేవా రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్ అన్నారు. రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నంద్యాలలోని పొన్నాపురం కాలనీ నీళ్ల ట్యాంకు దగ్గర ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో గ్రామ స్వరాజ్యం రావాలని, గ్రామంలో పరిపాలన సాగాలని పంచాయతీ, ఎంపిటిసి, జడ్పిటిసి వ్యవస్థలను తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనని అన్నారు. అద్భుతమైన టెక్నాలజీ తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు, బాలింతలకు ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ పౌష్టికాహారాన్ని ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ మాట్లాడుతూ అమెరికాలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న మనోజ్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వాస్పత్రిలో గర్భవతులకు, బాలింతలకు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేసినట్లు తెలిపారు. రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ కార్యక్రమం అనేక మందిని ఆకట్టుకుందని చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు ఏదో ఒక అనారోగ్యంతో హాస్పిటల్‌కు వస్తుంటారని, వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదలు మెచ్చే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోసన్నా వృద్ధాశ్రమం సూపర్వైజర్ భారతి పాల్గొన్నారు.


రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేస్తున్న జాన ప్రభాకర్

వైసిపి నాయకులు భూకబ్జాకోరులు

- దేవస్థానం భూములనూ వదలడం లేదు
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

భూకబ్జాలు చేయడానికే వైసిపి నాయకులు పదవులు చేపట్టారని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దుర్వేసి గ్రామంలో జరిగిన చెన్నకేశవ స్వామి ఉత్సవాల సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగభూపాల్ రెడ్డి స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాయలసీమ నుండి చాలామంది ముఖ్యమంత్రులుగా రాష్ట్రాన్ని పరిపాలించినా సీమకు తీరని అన్యాయం చేశారని అన్నారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీశైలంలో 854 అడుగులు నీరు ఉండాలని జీవో చేశారు కానీ, కోస్తా ప్రజలు ఆందోళన చేయడంతో జీవోను రద్దుచేసి రాయలసీమ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

అలాగే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాయలసీమలో చిన్న చిన్న ప్రాజెక్టులు చేశారు కానీ జాతీయ హోదా గుర్తింపు ఉండే పెద్ద ప్రాజెక్టు చేయలేదని గుర్తు చేశారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను 60 నుంచి 70 టిఎంసిల కెపాసిటీ పెంచింటే రాయలసీమలో నీటి కష్టాలు ఉండేవి కాదన్నారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, రాష్ట్రానికి రాజధాని లేదని, పేదవాళ్లు నలిగిపోతున్నారని, రాష్ట్రాన్ని అడుక్కుతినమని చిప్ప చేతికి ఇచ్చారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుకి ఏర్పాటు చేశారని, నీరు ఉపయోగపడేది నెల్లూరు ప్రజలకు మాత్రమే అని గుర్తు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో నడుముల లోతు నీళ్లు కూడా లేవని, రచ్చబండ తేలుతుందని బ్రహ్మంగారు చెప్పినట్టు పచ్చబండ తేలుతూ రాష్ట్ర ప్రజలకు అరిష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వైసిపి నాయకులు దేవుళ్లను, దేవస్థానం భూములను కూడా విడిచిపెట్టడం లేదన్నారు. హుసేనాపురం నుండి ఎంబాయి వెళ్లే రహదారిలో ఫారెస్ట్ గెస్ట్ హౌస్, నర్సరీని స్థానిక నాయకులు ఆక్రమించుకొని పాగా వేశారని, అడిగే నాథుడే కరువయ్యారని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు గురయ్యి ఇన్ని రోజులు కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని, వెలగమాను డ్యాము మా ప్రాణానికి పెద్ద పోలవరం డ్యామ్ అయిందని, రెండు డ్యాం పనులు పూర్తి అయ్యే దాఖలాలు లేవన్నారు. వీటన్నింటిపై 52 నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ నిర్వహిస్తున్నామని, విశేష స్పందన వస్తుందని, వచ్చే జూన్లో చలో ఢిల్లీ కార్యక్రమంలో జై రాయలసీమ నినాదాన్ని గట్టిగా వినిపిస్తామని తెలిపారు.


పుల్లారెడ్డి మృతదేహానికి నివాళ్లులర్పిస్తున్న మాజీ జడ్పిటిసి నాగిరెడ్డి

గుండెపోటుతో గ్రామ పెద్ద మృతి

- నివాళ్లులర్పించిన మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

ప్రజాశక్తి - పగిడ్యాల : పగిడ్యాల గ్రామ పెద్ద పుల్లారెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి, ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి పుల్లారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

కవులకు సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల : శ్రీ శ్రీ కళావేదిక వారు కర్నూలులో ఆదివారం నిర్వహించిన జాతీయ శతాధికా కవి సమ్మేళనంలో నంద్యాల పట్టణానికి చెందిన కవులు పాల్గొని కవిత గానం వినిపించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కవులు నీలకంఠమాచారి, కొప్పుల ప్రసాద్, రఫీ, మోహనరావు, రవి కుమార్‌లను శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ శాలువా, మెమెంటో, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. నంద్యాల చెందిన రచయితలు, ప్రముఖులు, సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవీంద్రనాథ్ తదితరులు సన్మానగ్రహీతలకు అభినందనలు తెలిపారు.


సన్మానం చేస్తున్న దృశ్యం

సాగునీరిచ్చే వరకూ దీక్ష

- సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

జూపాడు బంగ్లా మండలంలోని మండ్లం, తంగడంచ, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని 5 వేల ఎకరాల మెట్ట భూములకు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించే వరకు జల దీక్ష విరమించబోమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి ఫకీర్ సాహెబ, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో జరుగుతున్న జలదీక్ష ఆదివారం 26వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ప్రారంభించి మాట్లాడారు. రైతులు చేస్తున్న జల దీక్షకు సంఘీభావం ప్రకటించడంతోపాటు వారు చేసే ఆందోళనకు ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగు నీరు పేరుతో హంద్రీనీవా, రాయలసీమ, ముచ్చుమర్రి ఎత్తిపోతల ద్వారా నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పాలకులు నందికొట్కూరు ప్రాంత రైతులకు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం, శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయి మెట్ట ప్రాంతాలలో నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్న పేద, బడుగు, బలహీన వర్గాల రైతుల భూములకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులు చేస్తున్న పోరాటాలకు సిపిఎం, ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సురేష్, శివప్రసాద్, శ్రీనివాసులు, నాగరత్నం, ఈశ్వరయ్య, దాసు, విజయుడు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు ఎం.నాగేశ్వరరావు

బెస్త కాలనీలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - రుద్రవరం : మండల కేంద్రం రుద్రవరంలోని బెస్త కాలనీలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. సాయంత్రం పెద్ద గాలి వీచడంతో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు రాసుకుని మంటలు వ్యాపించి రవణమ్మ ఇంటిపై పడ్డాయి. దీంతో ఇంటిలో ఉన్న దుస్తులు, ధాన్యం, వంట సామాగ్రి పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కాలనీవాసులు అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. రెవెన్యూ అధికారులు నష్టపోయిన బాధితురాలకు ఆర్థిక సహాయం అందించాలని కాలనీవాసులు కోరారు.

రాయలసీమ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఏవి కళ్యాణ మండపం సమీపంలో భూమా ప్రీమియర్ లీగ్ రాయలసీమ స్థాయి క్రికెట్ పోటీలను బిజెపి ఆళ్లగడ్డ తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ పోటీలకు రాయలసీమ జిల్లాల నుండి విచ్చేసిన 50 క్రికెట్ టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలో భూమా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రాయలసీమ స్థాయిలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు.

26న మండల సర్వ సభ్య సమావేశం

ప్రజాశక్తి - పగిడ్యాల : పగిడ్యాల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు, మండలంలోని ఆయా శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికతో హాజరుకావాలని తెలిపారు. సర్వ సభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, లేనిపక్షంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌లో సత్తా చాటిన ప్యాపిలి విద్యార్థి

ప్రజాశక్తి - ప్యాపిలి : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాలలో ప్యాపిలి పట్టణంలోని హుసేనాపురం వీధికి చెందిన ఆలూరు వంశీ చౌదరి, సుహాసినిల కుమారుడు ఆలూరు మనోజ్ కుమార్ 120 మార్కులకు 94 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 1526వ ర్యాంకును సాధించాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా రాష్ట్రస్థాయిలో 1526 వ ర్యాంకు సాధించిన మనోజ్ కుమార్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, హుసేనాపురం కాలనీవాసులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణ పరిధిలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న జీవన్ జ్యోతి స్కూల్ వద్ద ఆదివారం బైకును బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగరంలోని కల్లూరు మండలం షరీఫ్ నగర్‌కు చెందిన రాఘవేంద్ర(23) తమ్ముడితో కలిసి పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో జరుగుతున్న మైసమ్మ జాతర ఉత్సవాలు చూడడానికి బంధువుల ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో నందికొట్కూరు పట్టణ పరిధిలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న జీవన్ జ్యోతి స్కూల్ వద్ద బైకును వెనుక భాగం నుండి బొలెరో వాహనం వచ్చి ఢీకొనడంతో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి సాయిరాం కర్నూల్‌లోని ఓ బేకరీలో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. తల్లి కొద్ది రోజుల క్రితమే చనిపోయింది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆహ్లాదకరంగా సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యంలోని గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ చాలా ఆహ్లాదకరంగా వుందని గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ అన్నారు. ఆదివారం గ్రంథాలయాన్ని, సమ్మర్ క్యాంపును ఆయన తనిఖీ చేశారు. పిల్లల ప్రతిభా విశేషాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్యాంప్‌లో ఆంగ్ల శిక్షణ, గణితంలో మెలుకువలు, చిత్రలేఖనం మొదలైన అంశాలను పిల్లలకు నేర్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై దాడి

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని హరి నగరం గ్రామ సమీపంలో అక్రమంగా జరుపుతున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడి చేశారు. జెసిబి, రెండు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు వీఆర్వో ఓబులేసు తెలిపారు. కేసు నమోదు చేశామని వీఆర్వో తెలిపారు. దాడిలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సిఐ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -ప్యాపిలి : ప్యాపిలి పట్టణంలో పోలీస్ స్టేషన్ మైదానంలో కొత్తగా నిర్మించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంను డోన్ డిఎస్‌పి శ్రీనివాస రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ గతంలో పూర్తిగా పడిపోయి శిథిలావస్థలో ఉన్న కార్యాలయాన్ని సిఐ శ్రీరాములు ఆధ్వర్యంలో భవనాన్ని పున నిర్మాణం చేపట్టినందుకు ఆయనను అభినందించారు. విధులు నిర్వహిస్తూ ఇలాంటి మంచి పనులు చేయడం సంతోషకర మన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల సిఐ ప్రియతమ్ రెడ్డి, ప్యాపిలి ఎస్ఐ రాకేష్, ఏఎస్ఐలు బ్రహ్మం, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రామంజి శేఖర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, హోంగార్డులు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి